శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## రైల్వే ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్







**బిట్రగుంట, మే 26 ప్రభాతవార్త** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో శుక్రవారం డివిజనల్ రైల్వే ఉన్నతాధికారుల సమక్షంలో 10వ ఎన్‌డిఆర్‌ఎఫ్ బెటాలియన్, సివిల్ డిఫెన్స్ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. రైలు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రయాణికులకు ప్రాణనష్టం జరగకుండా సత్వరమే ప్రమాదంలో చిక్కుకున్న రైలు బోగీలలో నుంచి ప్రయాణికులను వైద్యశాలకు తరలించడం వంటి విషయాలపై సుమారు నాలుగు గంటల పాటు మాక్‌డ్రిల్ నిర్వహించారు. డివిజనల్ అడిషినల్ రైల్వే మేనేజర్ విజయవాడ రైల్వే ఆపరేషన్స్ విభాగానికి చెందిన శ్రీకాంత్ ఆథ్వర్యంలో ఈ మాక్‌డ్రిల్ నిర్వహించారు. విజయవాడ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ వి.బి.మనోజ్ దగ్గరుండి ప్రమాదంలో చిక్కుకున్న ప్రయాణికులు బోగీల్లో నుంచి ప్రాణనష్టం జరగకుండా వైద్యశాలకు తరలించాలనే విషయంపై మాక్‌డ్రిల్‌లో వివరించారు. ఈ మాక్‌డ్రిల్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 108 సిబ్బంది, అగ్నిమాపక, సిబ్బంది, జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ సిబ్బంది సహాయక చర్యల్లో ఏ విధంగా పాల్గొనాలని రైల్వే కార్మికులకు వివరించారు. సుమారు 150 మంది రైల్వే కార్మికులు పాల్గొన్న ఈ మాక్‌డ్రిల్‌లో సీనియర్ డిఎస్‌వో జె.శ్రీనాథ్, సీనియర్ డియంఇ యం.రవికిరణ్, సీనియర్ డిఇఎన్ సౌత్ పి.వి.రమణారావు, బిట్రగుంట రైల్వే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్, ఎవోయం సి.హెచ్.సురేష్, ఎడియంఇ సుబ్రమణ్యం, ఎన్‌డిఆర్‌ఎఫ్ 10 బెటాలియన్ ఇన్స్‌పెక్టర్ రాబిన్, సీనియర్ సిడిఐ పి.సుధీర్‌బాబు, 10వ బెటాలియన్ ఇన్స్‌పెక్టర్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ చర్యలను బాధ్యతగా పాటించాలి



**నెల్లూరు కార్పొరేషన్,మే26,ప్రభాతవార్త** సమస్త జీవవాళి మనుగడకు అవసరమైన పర్యావరణాన్ని పరిరక్షించుకుని,రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ ఆకాంక్షించారు.ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి,గ్రామ,వార్డు సచివాలయ విభాగాల సంయుక్తాధ్వర్యంలో పర్యావరణహిత జీవనశైలి పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సైకిల్ ర్యాలీని శుక్రవారం ఉదయం నిర్వహించారు.స్థానిక గాంధీ బొమ్మ కూడలి నుంచి సైకిల్ ర్యాలీని కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు.సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ ఏ.సీ సుబ్బారెడ్డి క్రీడా మైధానం వరకు సైక్లింగ్ చేసిన ర్యాలీలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మనందరి దైనందిన అలవాట్లలో చిన్న చిన్న మార్పులతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు.ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగంపై నియంత్రణ,జౌళి సంచుల వాడకం,విద్యుత్ ఆదా,సోలార్ వస్తువుల వినియోగం,ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం,కాలుష్య ఉద్గారాల నియంత్రణ,తక్కువ దూరాలకు సైక్లింగ్,సాధ్యమయినంతవరకు ప్రజారవాణా వాడటం,ఎలవేటర్ బదులుగా మెట్లను వాడటం వంటి చర్యలతో మార్పుకోసం ప్రయత్నించాలని కోరారు.భవిష్యత్తులో పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవసరమైన ర్యాలీలు,నడకపోటీలు,మారథాన్ వంటి వినూత్న కార్యక్రమాలను క్రమం తప్పకుండా అమలు చేయనున్నామని తెలిపారు.వివిధ రకాల ప్రోత్సాహక కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం పెంచి,కాలుష్యరహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులయ్యేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తాని వెల్లడించారు.ఈ పర్యావరణ పరిరక్షణ ర్యాలీలో నెల్లూరు నగరపాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు,సిబ్బంది,మున్సిపల్ పాఠశాల విద్యా ర్థులు,ఉపాధ్యాయులు,స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వహకులు, స్త్రీ శక్తి సంఘాల సభ్యులు,అటవీశాఖ సిబ్బంది,కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది,గ్రామ,వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## జగనన్న ఇళ్ళ నిర్మాణాల్ని వేగవంతం చేయాలి



**కావలి, మే 26 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాకరంగా చేపట్టిన జగనన్న ఇళ్ళ నిర్మాణాల్ని త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ పిడి నరసింహం ఆదేశించారు. శుక్రవారం ఆయన వివిధ శాఖల అధికారులతో ముసునూరు జగనన్న మెగా లేఅవుట్‌లోని ఇళ్ళ నిర్మాణాల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు అందజేశారు. సకాలంలో ఈ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్దిదారుల చేత గృహ ప్రవేశాలు చేయించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డిఎల్‌డివో కనకదుర్గాభవానీ, హౌసింగ్ ఇఇ రంగవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాల పనితీరును మెరుగుపర్చాలి



**కావలి, మే 26 ప్రభాతవార్త** సచివాలయాల పనితీరును ఎప్పటికప్పుడు మెరుగుపరుస్తూ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను ఛేదిస్తూ ప్రజల మన్ననలు పొందాలని కావలి డిఎల్‌డివో కనకదుర్గాభవానీ ఆదేశించారు. కావలి పట్టణం వైకుంఠపురంలోని సచివాలయం 2, వాయునందన ప్రెస్ వీధిలోని సచివాలయాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సచివాలయలలో రిజిస్ట్రర్లు, ఆధార్ అప్‌డేటింగ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. రిజిష్టర్లు ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలన్నారు. సచివాలయాలలో ఎటువంటి ఫిర్యాదులు చోటుచేసుకోకుండా ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించకపోయినా, ఫిర్యాదులు చోటుచేసుకున్నా చర్యలు తప్పవని ఆమె హెచ్చరికలు చేశారు.

## విద్యుత్ కోతలతో విలవిల

**బిట్రగుంట, మే 26 ప్రభాతవార్త** బోగోలు మండలంలో గురువారం రాత్రి నుండి అప్రకటిత విద్యుత్ కోత విధిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ కోత వల్ల ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు అవస్థలు పడుతున్నారు. విద్యుత్ కోత వల్ల ఆగ్రహించిన చెంచులక్ష్మీపురం గ్రామంలోని ప్రజలు లైన్‌మెన్‌పై దాడికి పాల్పడ్డారు. అయితే ఉన్నతాధికారులే లోడ్ రిలీఫ్ కోసం కోతలు విధిస్తున్నారని స్థానిక విద్యుత్ అధికారులు చెబుతున్నారు. విద్యుత్ కోతలు ఈ విధంగా వుంటే సబ్‌స్టేషన్లు ముట్టడిస్తామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## పేదల గుండెల్లో చిరస్థాయిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



**వెంకటాచలం మే 26 ప్రభాతవార్త** పేదల సంబందించిన అభివృద్ధి సంక్షేమా కార్యక్రములు ఎప్పటికప్పుడు అందిస్తు ప్రజల ముంగిటికే నేరుగా సచివాలయ,వాలింటర్ల ద్వారా అందజేసి పేదల గుండెల్లో చిరస్తాయిగా ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ నిలిచారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు.మండల పరిదిలో సర్వేపల్లి పంచాయతీలోని నాగంబోట్లవారి కండ్రిగలో గడప గడప మన ప్రభుత్వ కార్యక్రములో మంత్రి కాకాణి పాల్గోన్నారు.అనంతరం మంత్రి కాకాణి మాట్లడుతూ గతంలో పింఛన్ కావలంటే జన్మభూమి కమిటి సభ్యులు చేత సంతకాలు చేస్తే కానే కేవలం టిడిపి కార్యకర్తలకే పదకాలు అందజేసేవారన్నారు.ఇప్పడు అలాంటి పరిస్ధితులు లేవుని రాజకీయాలకు పార్టీలకు అతీతంగా అర్హత కల్గిన పేదవాడికి పదకాలు అందజేస్తున్నామన్నారు.పారదర్శంగా పథకాలు అందిస్తున్నామన్నారు.గ్రామాలు సమగ్రంగా అభివృద్ధి జరగలనే లక్ష్యంతో గ్రామలకు నిదులు మంజూరు చేసి పెద్ద ఎత్తున అభివృద్ధి సంక్షేమా కార్యక్రములు చేశామన్నారు.గతంలో అనేక మంది శాసన సభ్యులుగా పని చేశారు.అర,కుర, అభివృద్ది జరిగింది తప్ప,సమగ్రహంగా అభివృద్ధి జరిగిన దాఖాలాలు లేవునన్నారు.దానికి నాంది పలికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సహయ సహకారాలతో గ్రామలు పెద్ద ఎత్తున అభివృద్ధి సంక్షేమా కార్యక్రమ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.రాబోయే రోజుల్లో ప్రజలు సంక్షేమా కార్యక్రములు చిత్తశుద్దితో పని చేస్తామన్నారు.సర్వేపల్లి నియోజకవకగంలో 89 సచివాలయాలు ఉన్నాయని ఇప్పటికి 88 పూర్తి చేసి చివరి సచివాలయం 89 సర్వేపల్లి గ్రామములో అడుగుపెట్టడం జరిగిందన్నారు.రేపుటితో గడప గడప కార్యక్రమ ముగిస్తుందని అన్నారు.5.కోట్ల 65 లక్షలతో సర్వేపల్లి పంచాయతీలో అభివృద్ధి సంక్షేమా కార్యక్రములు నిర్మించి ప్రారంభం చేయటం జరిగిందన్నారు.ఉప ఎంపిపి కనుపూరు కోదండరామిరెడ్డి,ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి ఆద్వర్యంలో మహిళలు మంత్రి కాకాణికి మంగళ హారతిలతో పూలతో ఘనంగా స్వాగతం పలికారు.ఈకార్యక్రములో తహశీల్దార్ కృష్ణ,ఎంపీడివో సుస్మిత,ఇరిగేసన్,హౌసింగ్ అన్ని శాఖలుదికారులు పాల్గోన్నారు.,నాయకులు జిల్లా వైసిపి అదికార ప్రతినిది మందల వెంకటశేషయ్య మోహన్‌నాయడు,భాస్కర్‌నాయడు,నాటకం శ్రీనివాసులు గుమ్మా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా గ్రంధాలయ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయండి



**నెల్లూరు,మే26 ప్రభాతవార్త-విద్య** జిల్లా కేంద్ర గ్రంధాలయ నూతన భవన నిర్మాణా పనులను త్వరిగతగిన పూర్తిచేయ్యాలని ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. శుక్రవారం నగరంలోని రేబాల వీదిలో సుమారు రూ.3కోట్ల వ్యయతో నిర్మిస్తున్నకేంద్ర గ్రందాలయ నూతన భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించి పనులు జరుగుతున్న తీరును తెలసుకున్నారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతు అందరికి విజ్ఞానాన్ని అందించే గ్రంధాలయ భవనాల నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేసి వాడుకలోకి తీసుకురావాలన్నారు. నాణ్యతలో రాజీ పడే ప్రశక్తే లేదని పేర్కొన్నారు. పనుల్లో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా ఉపేక్షించిబోమని హెచ్చరించారు. జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద మాట్లాడుతు ప్రస్తుతం ఉన్న కేంద్ర గ్రంధాలయం పురాతనమైనది కావటంతో వర్షా కాలం వస్తే ఉరుస్తు ఉండేదన్నారు. అలాగే జిల్లాలోని అనేక చోట్ల రోడ్డు విస్తరణ పేనుల్లో గ్రంధాలయాలు, వాటి ఆస్తులు పోయాయని, వాటికి తక్షణం నష్టపరిహారం అందజేయ్యాలన్నారు. జిల్లాలో అనేక చోట్ల పాఠశాలలు ఖాళీగా ఉన్నాయని అటువంటి పాఠశాలలను గ్రంధాలయాలకు అప్పగిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గ్రందాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో శిక్షణ పొందుతున్న చిన్నారులో కలెక్టర్ మాట్లాడి కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమలంలో గ్రంధాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా, ఏపీఈడబ్ల్యుఐడిసి ఈఈ హనుమంతరావు, డిఈ సుబ్బరాయులు, సంస్థ సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

## ఎస్పీ కార్యాలయంలో పోలీస్ సంక్షేమ దివాస్



**నెల్లూరు(క్రైం),మే26ప్రభాతవార్త** జిల్లాలోని పోలీసు సిబ్బందికి ఆంధ్రప్రదేశ్ డిజిపి ఉత్వర్వుల మేరకు వారి సమస్యలపై నిర్వహించే సంక్షేమ దివాస్ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా ఎస్పీ డాక్టర్ కె.తిరుమళేశ్వర రెడ్డి నిర్వహించారు.జిల్లా పోలీసు కార్యలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనారోగ్యం,బదిలీలు,సర్వీసుకు సంబందించిన సమస్యల అర్జీలను ఎస్పీ స్వయంగా పరిశీలించి వాటిని నిశితంగా పరిశీలించి ,సిబ్బంది యోగ క్షేమాలను తెలుసుకున్న ఎస్పీ వారి సమస్యలను వీలువున్నంతవరకు పరిష్కరించడం జరుగుతుందని హామీ ఇచ్చారు.అనారోగ్యం, తల్లితండ్రులు,చిన్నపిల్లల సంరక్షణ తదితర సమస్యలతో దైరప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అవసరాలకు అనుగుణంగా బదిలీల విషయంలో తప్పక ప్రాధాన్యత కల్పిస్తామని ఎస్పీ తెలిపారు. విధి నిర్వహణలో ఎవరూ ఆలసత్వం ప్రదర్శించరాదని, అనవసరంగా అనుమతి లేకుండా విదులకు గౌర్హాజరు కావద్దని తద్వారా క్రమశిక్షణ చర్యలకు గురికావద్దన్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను పరిశీలించి మహిళా పోలీసుల బదిలీ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.సిబ్బంది సంక్షేమానికి కేటాయించిన పోలీస్ వేల్ఫేర్ డే ను సిబ్బంది వారి వారి అవసరాలకు అణుగునంగా వినియోగించుకోవాలన్నారు.డిజార్టర్ నుండి విధులకు సాదారణ బదిలీలు,అనారోగ్య సమస్యలు,సర్వీసు సంబందింత సమస్యలపై ఆయన సిబ్బంది నుండి అర్జీలు స్వీకరించారు.

## ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆదాని ఫౌండేషన్ కృషి



**ముత్తుకూరు,మే26,ప్రభాతవార్త** ప్రజల ఆరోగ్య పరిస్థితుల కోసం ఆదాని ఫౌండేషన్ కృషి చేస్తుందని ఆదాని కృష్ణపట్నం పోర్టు అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ తెలిపారు.శుక్రవారం ఉదయం ముత్తుకూరు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఆదాని చికిత్సలయంలో నిర్వహించిన మెగా వైద్యశిబిరానికి ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల సహకారంతో అపోలో హాస్పిటల్ ఆదాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.పోర్టు పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆదాని కృష్ణపట్నం పోర్టు కృషి చేస్తుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. వైద్యశిబిరంలో సుమారు 300మందికి బిపి, షుగర్,జనరల్ హెల్త్‌చెకప్,కంటి పరీక్షలు నిర్వహించడమైనది.

ఈ కార్యక్రమంలో ముత్తుకూరు ప్రభుత్వ వైద్యాధికారి కంటి వైద్య నిపుణులు డాక్టర్ బాలపద్మ,ఆపోలో హాస్పిటల్ డాక్టర్ గాయత్రి,ఆదాని ఫౌండేషన్ డాక్టర్ సుహార్సన్,ఆదాని ఫౌండేషన్ ప్రతినిధి రాజేష్ రంజన్,రామానంద్‌యాదవ్,రమేష్‌బాబు,రవీంద్రబాబు,తదితరులు పాల్గొన్నారు.

## 2వేల నోటు నిరాకరణ

**వింజమూరు,మే26ప్రభాతవార్త:** రిజర్వ్ బ్యాంక్ ఇటీవల 2వేల రూపాయల నోటు రద్దు విషయాన్ని ప్రకటించి సెప్టెంబర్ నెల వరకు మార్చుకోవచ్చని గడువు ఇచ్చారు. అయినా వింజమూరులోని విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో అధికారులు 2వేల రూపాయల నోటును నిరాకరించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత రెండురోజులుగా వింజమూరులో విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు వినియోగదారులు 2వేల రూపాయల నోటును తెచ్చి బిల్లు కట్టించుకోమని అడగ్గా అక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఖరాకండిగా 2వేల రూపాయల నోటు తీసుకోమని, ఉన్నతాధికారుల నుండి స్పష్టమైన ఆదేశాలున్నాయని చెబుతుండడంతో బిల్లులు చెల్లించేందుకు వచ్చిన వయసుపైబడినవారు, వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వరంగ సంస్థలు కూడా ఇలా నిరాకరించడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## క్యాన్సర్ రోగులకు మంచి వైద్య సేవలందించండి



**నెల్లూరు మే 26, ప్రభాతవార్త-వైద్యం** క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ రెడ్‌క్రాస్ వైద్యశాలకి వచ్చే రోగులకు ఉన్నతమైన వైద్యాన్ని అందించాలని కలెక్టర్ హరినారాయణ అధికారులకు సూచించారు. నగరంలో ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ క్యాన్సర్ ఆసుపత్రిని కలెక్టర్, జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడు ఎం.హరినారాయణ శుక్రవారం సందర్శించారు. మొదటసారిగా ఆసుపత్రికి చేరుకున్న కలెక్టర్‌కు సర్జికల్ అంకాలజిస్ట్ నాగేశ్వరరావు, సీనియర్ రేడియేషన్ థెరపిస్ట్ గీతాఉషశ్రీ, వైస్‌చైర్మన్ సుధీర్‌నాయుడు, మేనేజర్ జుబేర్ తదితరులు స్వాగతం పలికారు. పరిపాలన విభాగము, రేడియాలజీ విభాగం, రేడియేషన్ ఎక్విప్‌మెంట్, ఒపి విభాగాలను హరినారాయణ పరిశీలించారు. రోగులకు అందిస్తున్న ఏ విధమైన సేవలు అందుతున్నాయో వైద్యులను అడిగితెలుసుకున్నారు. క్యాన్సర్ నెలసరి ఖర్చుల వివరాలను హరినారాయణ అడిగి తెలుసుకున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చే రోగులకు వైద్యం అందించి రెడ్‌క్రాస్‌కు పేరు ప్రఖ్యాతులు తీసుకోరావాలన్నారు. అనంతరం కలెక్టర్ హరినారాయణ మద్రాసు బస్టాండు సమీపంలో ఉన్న రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌ను సందర్శించి రక్త సేకరణ నుండి దానిని భద్రపరచే తీరును, తిరిగి పేదలకు అందించే పద్ధతిని డాక్టర్ యసోవర్ధన్ కలెక్టర్‌కు వివరించారు. నెల్లూరు బ్లడ్ బ్యాంక్ రాష్ట్రంలో మొదటస్థానంలో, దేశంలోనే రెండో స్థానంలో ఉందని, బయట ప్రాంతాల్లో 1550 రూపాయలకు బ్లడ్ అందిస్తే నెల్లూరు బ్లడ్ బ్యాంక్ రూ.1050కే అందిస్తున్నామని వివరించారు. మందబుద్ధి గల సుమారు వందమంది పిల్లలకు స్పీచ్ థెరపి, కంప్యూటర్ నేర్పిస్తున్నామని బ్లడ్ బ్యాంక్ డాక్టర్ అజయ్‌బాబు చెప్పారు. మస్తానయ్య, సురేష్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల్లో మరింత అవగాహన పెరగాలి



**కోవూరు, మే 26 ప్రభాతవార్త :** కోవూరు వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్‌లో ఈ ఎడగారు సీజన్‌లో నాట్లు వేస్తున్న రైతులు ఆయా గ్రామాల్లో ఉన్న వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తప్పక పాటించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత అన్నారు. కోవూరులోని వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్ కార్యాలయంలో గురువారం సబ్‌డివిజన్ పరిధిలోని ఏవోలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఈ ఎడగారు సీజన్‌కు సంబంధించిన 2500 ఎకరాల్లో నాట్లు వేయడం జరిగిందన్నారు. ప్రధానంగా నార్లు పోసిన రైతులు వాటిని పీకే ముందు వారం రోజుల ముందుగా ఎకరాకు 5 కిలోల చొప్పున జిప్సంను వేయాలని రైతులకు సూచించారు. ఎరువులను కూడా సిఫార్సు చేసిన మోతాదులోనే వాడాలన్నారు. వేసే ఎరువులను కూడా పైపాటులో కాకుండా దుక్కిలోనే వేసేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 27వ తేది శనివారం కోవూరు సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన వ్యవసాయ సహాయకులకు గుమ్మలదిబ్బలోని రైతుభరోసా కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు వారు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈ సమీక్షలో మండల వ్యవసాయాధికారులు ఇందిరావతి, లక్ష్మి, సురేంద్రరెడ్డిలు ఉన్నారు.

## ప్రాథమిక దశ నుంచి గ్రంథ పఠనం ప్రధానం



**కోవూరు, మే 26 ప్రభాతవార్త :** ప్రాథమిక దశ నుంచి ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయడం ద్వారా వారిలో దాగి ఉన్న మేదస్సు మరింత మెరుగుపడుతుందని లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి అన్నారు. కోవూరులోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు గ్రంథాలయం దానికి సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయంలో అనేకమంది చరిత్రకారులు, మహనీయులకు సంబంధించిన గ్రంథాలు ఉన్నాయని, వాటిని పూర్తిగా ఆకళింపు చేసుకోవాలన్నారు. దీని వలన వారిలో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు పి. రంగారెడ్డి విద్యార్థులకు నీతికథలు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాఠకులు సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

## దేవాలయంలో ఘనంగా అన్నదానం



**కోవూరు, మే 26 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం ఆలయంలో స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యులు ప్రత్యేక అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి వారి తండ్రి వెంకటస్వామిరెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మందులు వాడకంలో నిర్లక్ష్యం వద్దు



**కోవూరు, మే 26 ప్రభాతవార్త :** దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ప్రతి ఒక్కర మందులు వాడకం విష యంలో నిర్లక్ష్యం వద్దని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రవిబాబు తెలిపారు. కోవూరు పంచాయతీ పరిధిలోని మూడవ సచివాలయ ప్రాంతంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈకార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. దీనిని వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## మహానాడుతో రాష్ట్రంలో పండుగ వాతవరణం



ఉదయగిరి మే 26 ప్రభాతవార్త ఉదయగిరి మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు రాజమండ్రిలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడుకు బారీగా తరలివెళ్లారని టిడిపి రా ష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పొన్నుబోయిన చెంచలబాబుయాదవ్ తెలిపారు.రాజమండ్రిలో జరుగుతున్న మహానాడు బహిరంగ సభ ఏర్పాట్లు పరిశీలించిన ఆయన మహానాడుతో రాజమండ్రి మొత్తం పసుపుమయమైందని పండుగ వాతావరణం సంతరించుకుందని తెలిపారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబునాయుడ్ని ముఖ్యమంత్రి చేయుటకు వెయ్యికళ్ళతో ఎదురు చూస్తున్నారని తెలిపారు. మహానాడు వేదికగా జగన్‌రెడ్డి నిరంకుశపాలనకు చెరమగీతం పాడేందుకు రాష్ట్ర ప్రజలు సన్నద్ధం అవుతున్నారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఆయన వెంట టిడిపినాయకులు సుమన్, అంబటి మస్తాన్, తదితరులున్నారు.

## లస్కర్‌పై డిఇ ఫిర్యాదు

**ఉదయగిరి మే 26 ప్రభాతవార్త** ఉదయగిరి మండలం గండిపాళెం గ్రామంలోని ప్రాజక్టు వద్ద తాత్కాలిక లస్కర్‌గా పనిచేస్తున్న బాషా అనే వ్యక్తి మీద ఇరిగేషన్ డిఇ సాయిశంకర్‌నారాయణ ఉదయగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.బాషా అనే వ్యక్తి అనుచితంగా ప్రవర్తిస్తు దుర్బాషలాడుతు విధులకు ఆటంకం కలిసున్నాడని ప్రాజక్టు పరిధిలోని చిల్లకర్ర వ్యవహారంలో బ్లాక్‌మైల్ చేస్తు పలువురు వద్ద దౌర్జన్యంగా డబ్బులు తీసుకున్నాడని ఆవిషయంలో పలువురు డిఇకి ఫిర్యాదు చేయగా వివరణ కోరిన డిఇ మీద దాడికి పాలుపడి అతని కారు తాళలు తీసుకొని దౌర్జన్యానికి దిగాడని డిఇ పిర్యాదు చేశారు.

## వైసీపీ పెత్తందారుల వల్ల పేదలకు ఇబ్బంది



**కోవూరు, మే 26 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గ పలు ప్రాంతాల్లో వైసీపీ పెత్తందారుల వల్ల అనేక మంది పేదలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి జి. కిషోర్ అన్నారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని ముదివర్తి గ్రామంలో అంగవైఖల్యంతో బాధపడుతున్న అహ్మద్, మరికొంత వ్యక్తులకు సంబంధించిన 30 ఎకరాల భూమిని వైసీపీ పెత్తందారులు ఆక్రమించాలని చూస్తున్నారన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చెప్పినట్లు అందరం కలిసి కట్టుగా ఈ వైసీపీ పెత్తదారుల సమస్యను ఎదుర్కోవల్సిన అవసరం ఉందన్నారు. దాదాపు 50 సంవత్సరాల పైబడి స్వాధీన అర్హత కలిగి పన్నులను, కరెంటు బిల్లులను చెల్లించుకుంటున్న బాధితులకు ఆ స్థలానికి వారికి సంబంధం లేదని ఈ నేతలు ఎలా చెబుతారన్నారు. ఈవిషయమై అనేకసార్లు రెవెన్యూ అధికారులను బాధితులు కలిసినా ప్రయోజనం లేదన్నారు. గతంలో ఈ స్థలాల విషయమై ఎదురుతిరిగిన ఓ మహిళను ఊరినుంచి పంపేశారన్నారు. ఈ విషయమై బాధితులకు న్యాయం జరిగే వరకు జనసేన పార్టీ వారికి అండగా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ దృష్టికి కూడా తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఇటీవల తాము చేసిన పోరాటం కారణంగా ఇసుక, గ్రావెల్, అక్రమ రవాణాను అడ్డుకోగలిగామన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు బి. సుధీర్, కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, హేమచంద్ర యాదవ్, ప్రసన్న, తదితరులు ఉన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం తగదు



**కోవూరు, మే 26 ప్రభాతవార్త :** గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ప్రభుత్వం నిర్దేశించిన వేళలతో పాటు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీవో శ్రీహరి అన్నారు. కోవూరు పంచాయతీ పరిధిలోని సచివాలయం-3ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయంలో స్పందనలో వచ్చే అర్జీలకు తగు పరిష్కారం చూపడమే కాకుండా వాటిని ఒక ప్రత్యేక రిజిస్టర్‌లో నమోద చేసి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలన్నారు. అదేవిధంగా ప్రతి సచివాలయంలో తప్పనిసరిగా తనిఖీ రిజిస్టర్ ఉండాలన్నారు. సచివాలయంలో పనిచేసే ప్రతిఉద్యోగి రెండు పూటలా తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలన్నారు. సచివాలయ కార్యదర్శి చందన, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

## గృహ నిర్మాణాలపై పొదుపు సభ్యులకు అవగాహన



**బిట్రగుంట, మే 26 ప్రభాతవార్త** బోగోలు మండలంలోని బిట్రగుంట పంచాయతీలో శుక్రవారం జగనన్న పేదలందరికి ఇళ్లు కార్యక్రమంలో భాగంగా పొదుపు గ్రూపు మహిళలకు గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపిడివో శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వం ఆశించిన సొంత ఇల్లు కల నెరవేర్చుకునేందుకు 35 వేల రూపాయలు పొదుపు మహిళలకు రుణ సదుపాయం కల్పిస్తున్నారని దీనిని సద్వినియోగం చేసుకొని ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు. హౌసింగ్ ఎఇ వెంకటయ్య, వెలుగు ఎపియం నాగమణి, పొదుపు గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

## మహానాడుకు బయలుదేరిన ధర్మవరం



**నెల్లూరు మే 26, ప్రభాతవార్త-వైద్యం** రాజమహేంద్రవరంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహానాడుకు రాష్ట్ర టీడీపీ బీసీసెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరం.సుబ్బారావు ఆధ్వర్యంలో నగరరం నుండి భారీసంఖ్యలో కార్యకర్తలతో కార్లలో ర్యాలీగా శుక్రవారం సాయంత్రం రాజమహేంద్రవరానికి బయలుదేరి వెళ్ళారు. ఈ సందర్భంగా ధర్మవరం విలేఖరులతో మాట్లాడుతూ ఈ మహానాడులో టీడీపీ అధికారంలోకి ప్రజల అభ్యున్నతికి ఏమి చేయనుందో చంద్రబాబు వివరిస్తారన్నారు. ఇందులో ప్రజలకు సేవ చేయడం పట్ల మా అంకితభావాన్ని కూడా ఉత్తేజ పరచేదే మహానాడన్నారు. శనివారం ప్రారంభం కానున్న మహానాడుకు ప్రతి కార్యకర్త వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి బాలక్రిష్ణచౌదరి, డాక్టర్ గణేష్‌కుమార్, కంచి.మల్లిఖార్జునరెడ్డి, అరటిపాముల.రత్నం, మహంకాళి, వెంకటరమణయ్య, కేసీ.భాస్కర్, అద్దంకి.క్రిష్ణ, రమణయ్య, సుబ్రమణ్యం, కె.రవి, వెంకటశేషయ్య, చిన్నసాయి, నరసింహులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళల ఉపాధికి పశుపోషణ దోహదపడుతుంది




**బిట్రగుంట, మే 26 ప్రభాతవార్త** మహిళాల జీవనోపాధికి ఆదాయం సమకూర్చేది పాడిపరిశ్రమ అని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మహేశ్వరరావు తెలిపారు. బోగోలు మండలం జువ్వలదిన్నెలో సేవ్ ది చిల్డ్రన్, నోకియా సంస్థల ద్వారా మహిళా రైతులకు పాడిపరిశ్రమపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతమ్ మాట్లాడుతూ గేదెల పెంపకం చేపట్టేప్పుడు వాతావరణం, షెడ్‌ల నిర్మాణం, దాణా తదితర వాటిపై అవగాహన కలిగి వుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజేత డెయిరీ మేనేజర్ పి.ఆనందరెడ్డి, గోపాలమిత్ర కె.శ్రీనివాసులు, సేవ్ ది చిల్డ్రన్ సంస్థ జిల్లా సూపర్‌వైజర్ యం.వి.రమణయ్య, గ్రామ సర్పంచ్ గోవిందస్వామి, ఎంపిటిసి కొండయ్య, సేవ్ ది చిల్డ్రన్ సంస్థ సభ్యులు ప్రసన్న, రాజు, మధు, భరత్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## 60 మంది చిన్నారులకు పాదరక్షలు పంపిణీ



నెల్లూరుఅర్బన్,మే26ప్రభాతవార్త నెల్లూరు అర్బన్ ఐసిడిఎస్ పరిధిలోని బోడిగాడితోట,అహమద్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల సుహాసిని, తల్లితండ్రులైన రాజ్యలక్ష్మీ,సుబ్బారావులు వేసవి సందర్బంగా 60 మంది పిల్లలకు పాదరక్షలు ఆందజేశారు. రక్తహీనతతో వున్న ముగ్గురు గర్భవతులకు వేరుశనగ చిక్కీలు ఆందజేశారు. ఈ సందర్భంగా వారికి నెల్లూరు అర్బన్ ప్రాజెక్ట్ తరపున సిడిపిఓ యం.అన్నపూర్ణ,ఎసిడిపిఓ లక్ష్మీదేవిలు కృతజ్ఞతలు తెలిపారు. సూపర్‌వైజర్ ప్రమీల,అంగన్‌వాడీ కార్యకర్తలు,సహాయకులు పాల్గోన్నారు.

## జనసేన ఆద్వర్యంలో చిరువ్యాపారులకు గొడుగుల పంపిణీ



నెల్లూరు,మే26 ప్రభాతవార్త-విద్య జనసేన నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని స్థానిక ఆత్మకూరుబస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట, ఎద్దల సంఘం,ఎదురు సంఘం మెయిన్ రోడ్డులోని రోడ్డు మార్జిన్ వ్యాపారులు, చిరువ్యాపారులకు గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు గత కొది రోజులుగా నగరంలో వేసవి తాపం అధికంగా ఉందన్నారు. భానుని ప్రకోకాపిని నగర వాసులు విలవిల్లాడుతున్నారన్నారు. అంత వేసవిలో కూడా ఉన్న చోటునుండి కదలకుండా అక్కడే ఉంటూ చిరు వ్యాపారులు వారి వా యపారాలను సాగిస్తూ నానా ఇబ్బ ందులు పడుతుండేవారన్నారు. వారి ఇబ్బందులను , ఆర్థిక పరిస్థితులను అంచనా వేసి తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయ సాధనలో భాగంగా చిరువ్యాపారులను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో వారికి గొడుగులు పంపిణీ చేయటం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, వెంకటేష్,మనీ, సాయి, షారు, తదితరులు పాల్గొన్నారు.

## రిలే నిరాహారదీక్షను విజయవంతం చేయాలి

**వింజమూరు,మే26ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో భాగంగా శనివారం వింజమూరు తహసిల్దార్ కార్యాలయం ఎదుట చేయతలపెట్టిన రిలే నిరాహారదీక్షలను విజయవంతం చేయాలని ఎపి జిఇఎ వింజమూరు తాలూకా అధ్యక్షుడు , చాకలికొండ పంచాయతీ కార్యదర్శి డి.శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల హక్కులను కాలరాస్తూ కనీసం నెలనెలా వచ్చే వేతనాలను కూడా జాప్యం చేస్తూ ఉద్యోగులు దాచుకున్న జిపిఎ, ఎపిజిఎల్ఐ వంటి నిధులను కూడా సక్రమంగా వాడుకోనివ్వకుండా సరండర్ లీవ్ వంటి అనేక ఉద్యోగ రాయితీలను మంజూరు చేయకుండా ప్రభుత్వం ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయడం సముచితం కాదన్నారు .ఈనేపథ్యంలో ఉద్యమమే శరణ్యమని భావించామన్నారు. సిపిఎస్‌ను రద్దుచేసి , ఓపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ప్రతినెలా 1వ తేదీనే జీతభత్యాలు చెల్లించేలా ప్రత్యేక చట్టం తేవాలన్నారు. 11వ పిఆర్‌సి అమలు , ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల్లో భాగంగా ఆర్థికపరమైన ఒప్పందాలను , బకాయిలను , డిఎ, అరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు . ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు రిటైర్డ్ అయిన రోజునే ఉద్యోగానికి సంబంధించిన ఆర్థిక సదుపాయాలను వెంటనే కల్పించాలన్నారు . ఈకార్యక్రమంలో ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## 300 రోజుల పాటు పేదలకు అన్నదానం చేసిన సిద్దు చాలా గొప్పవాడు



**కావలి, మే 26 ప్రభాతవార్త** కావలి ఏరియా వైద్యశాల ఆవరణలో పవనన్న అన్నంబండి ద్వారా జనసేన యువనేత యం.వి.సిద్దు ఇప్పటికి 300 రోజుల పాటు పేదలకు అన్నదానం చేస్తున్న ఆయన రాజకీయ నాయకులకన్నా ఎంతో గొప్ప వ్యక్తి అని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు, న్యాయవాది ఎస్.మల్లికొనియాడారు. శుక్రవారం కావలి ఏరియా వైద్యశాలలో భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. రోజుకు వంద మంది పేదలకు 300 రోజుల పాటు భోజనం ఉచితంగా అందజేయడం సిద్దు గొప్పతనానికి నిదర్శనమన్నారు. ఆయనను అందరు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నేత, కాపు, బలిజ సంఘం అధ్యక్షులు తోట వెంకట శేషయ్య మాట్లాడుతూ పవనన్న అన్నంబండి ద్వారా పేదల ఆకలి తీర్చాలన్న సంకల్పంతో జనసేన యువనేత యం.వి.సిద్దు 300 రోజులుగా భోజనం అందజేస్తున్నారన్నారు. ఆయన అందరికి ఆదర్శమన్నారు. ప్రతి యువకుడు సిద్దుని స్పూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. యం.వి.సిద్దు మాట్లాడుతూ డొక్కా సీతమ్మ స్పూర్తితో పవర్‌స్టార్ పవనన్న ఆశయంతో ప్రతి పేదవాని ఆకలి తీర్చాలన్న సంకల్పంతో 300 రోజులుగా భోజనాలు అందజేస్తున్నానన్నారు. ప్రభుత్వాలు పేదలకు ఉచితంగా భోజనం పెట్టేంత వరకు ప్రతి రోజు పవనన్న అన్నంబండి ద్వారా పేదల ఆకలి తీరుస్తూనే వుంటానని తెలిపారు.జనసేన రూరల్ అధ్యక్షులు తిరుపతిస్వామి, విద్యార్థి నాయకులు విజయ్, తోట సాయి, సురేష్, జాని, పాండు, స్వామి, విజయ్, కృష్ణ, శ్రీహరి,సాయి తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలి



**కావలి, మే 26 ప్రభాతవార్త** సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. కావలి ఏరియా వైద్యశాల వద్ద శుక్రవారం రిలేనిరాహారదీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్ కంటిజెంట్ ఉద్యోగులు, పెన్షనర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్దఎత్తున తరలివచ్చి రిలేనిరాహారదీక్ష చేపట్టారు. ఈ శిబిరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షులు వై.రమణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జె.సుజాతబాయి, రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి.వెంకటరెడ్డి, కావలి తాలూకా యూనిట్ అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొని మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకత్వ కార్యాచరణ పిలుపు మేరకు ఈ నెల 22వ తేది నుండి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రోజుకొక తాలూకా కేంద్రంలో రిలేనిరాహరదీక్ష శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా ఈ రోజు తలపెట్టిన రిలేనిరాహార దీక్ష శిబిరంలో పెద్దఎత్తున ఉద్యోగులు పాల్గొనడం చెప్పుకోదగ్గ విశేషమన్నారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించడంతో పాటు ప్రతి నెల 1వ తేదిన జీతభత్యాలు చెల్లించేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. 1993 నవంబరు 25వ తేది కంటే ముందు నియమితులైన ఎన్‌యంఆర్ డైలీ వేజస్ కంటెంజెంట్ ఉద్యోగులందరిని వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 11వ పిఆర్సీ అమలులో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలలో భాగంగా ఆర్థికపరమైన బకాయిలు, డిఎ ఎరియర్స్‌ను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాలతో నేరుగా సంప్రదింపులు జరిపి 12వ పిఆర్సీ వేతన సవరణ చేపట్టాలన్నారు. ఉద్యోగులు దాచుకున్న సొమ్ములు జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ భద్రత కల్పించాలన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులందరికి ఆ రోజే అన్ని ఆర్థిక ప్రయోజనాలు విడుదల చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ని సమావేశపర్చి చర్చించి పరిష్కరించాలన్నారు. ఈ రిలేనిరాహారదీక్షకు కావలిలోని అన్ని శాఖల ఉద్యోగులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యవర్గం నేతలు పాల్గొని జయప్రదం చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి డిమాండ్లను పరిష్కరించాలన్నారు.

## మెడికవర్‌లో అరుదైన శస్త్రచికిత్స




**నెల్లూరు మే 26, ప్రభాతవార్త-వైద్యం** రక్తప్రసరణ ఆగిపోయి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి అరుదైన శస్త్రచికిత్స చేసి అతనిని ప్రాణాలను కాపాడగలిగామని మెడికవర్ అసుపత్రి న్యూరాలజిస్ట్ వైద్యులు వైష్ణవి, చైతన్యలు పేర్కొన్నారు. ఈ మేరకు ఆ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వైష్ణవి మాట్లాడుతూ ఇటీవల తమ ఆసుపత్రికి 51ఏళ్ళ వయస్సు గల హజరత్తయ్య అనే వ్యక్తి ఛాతినొప్పితో బాధపడుతూ శ్వాస ఆడకపోవడం లాంటి లక్షణాలతో ఇక్కడకి రావడం జరిగిందన్నారు. వెంటనే రోగిని ఎమెర్జెన్సీ విభాగానికి తరలించి ఆయనకి ప్రాధమిక వైద్య పరీక్షలు నిర్వహించి బీపీ, గుండె పరీక్షలు నిర్వహించామన్నారు. రోగికి పరీక్షలు చేస్తున్నప్పుడే పక్షపాతం రావడం జరిగిందన్నారు. ఎమెర్జెన్సీ వైద్య సిబ్బంది సిటీస్కాన్ తీసి పరిశీలించగా అతనికి రక్త ప్రసరణ సరిగా జరగడం లేదని తెలిసిందన్నారు. గుండెపోటుతోపాటు బ్రెయిన్ స్ట్రోక్ కూడా వచ్చిందని వెల్లడించారు. అవేకాక పలు వ్యాధులు బయట పడ్డాయని, ముందుగానే వాటిని గుర్తించి ఆయనను ప్రాణాయపాయ స్థితి నుండి కాపాడగలిగామన్నారు. ఆయనకు ఫైవ్ సైకిల్ (సిపిఆర్) నిర్వహించామని తెలిపారు. సకాలంలో గుండె, నరాలకు సంబంధించిన వైద్యం అందించి ఆయన ప్రాణాలకు కాపాడగలిగామన్నారు. శస్త్రచికిత్స అనంతరం రోగిని కొన్ని గంటలపాటు అబ్జర్వేషన్‌లో ఉంచి ఆ తరువాత రోగికి వెంటిలేషన్‌ను తొలగించడం జరిగిందన్నారు. మెడికవర్‌లో అత్యంత ఆధునిక పరికరాలు ఉండడం వల్లే ఇలాంటి వైద్యాన్ని అందించి ఎంతోమంది ప్రాణాలను సైతం కాపాడుగలుగుతున్నామన్నారు. ఈ సమావేశంలో ఆ ఆసుపత్రి హెడ్ డాక్టర్ గణేష్, నాగిరెడ్డి, మెఘాచిత్కర, మహేశ్వర్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## విజ్ఞాన బండాగారాలు గ్రంధాలయాలు




రాపూరు,మే26ప్రబాతవార్త గ్రంధాలయాలు విజ్ఞానాన్ని అందించే బండాగారాలు అని రాపూరు గ్రంధాలయ అధికారిణి ధనమ్మ తెలిపారు.వేసివి శిక్షణా శిబిరాలలో బాగంగా శుక్రవారం వేసవి శిక్షణా శిబిరానికి వచ్చిన విద్యార్థులతో ఆమెమాట్లాడుతూగ్రంధాలయాలు విజ్ఞాన బండాగారాలు అని తెలిపారు. ఈక్కడ అన్ని రకాలైన చరిత్ర కారులు, స్వాతంత్ర సమరయోధులు,ప్రసిద్ద కవులు,శాస్త్రవేత్తలు వంటి వారికి సంబందించిన వారు చేసిన కృషికి సంబందించిన పుస్తకాలు అందుబాటులోవుంటాయని వీటిన చదివివిజ్ఞానాన్ని పెంపొం దించుకోవాలని కోరారు. విద్యార్థులకు క్వీజ్ పోటీలను నిర్వహించి విద్యార్ధులకు మిఠాయిలు పంచి పెట్టారు.

## అహంకారానికి ఆత్మగౌరవానికి మధ్య యంఆర్‌పిఎస్ పోరాటం



**రాపూరు,మే26ప్రబాతవార్త** అహంకారానికి ఆత్మగౌరవానికి మధ్య యంఆర్‌పిఎస్ పోరాటం చేస్తున్నట్లు వెంకటగిరి నియోజకవర్గ యంఆర్‌పిఎస్ఇన్‌చార్జ్ గోవిందు రంగయ్య తెలిపారు. గడపగడపకు యంఆర్‌పిఎస్ కార్యక్రమంలో బాగంగా శుక్రవారం రాపూరు మండలంలోని వెలుగోను గ్రామంలో పర్యటించిన ఆయన యంఆర్‌పిఎస్ కార్యకర్తలతో మాట్లాడుతూ ఎస్‌సీలలోనిమన సోదరులు అధికారం వుందన్న అహంకారంతో మన అడబిడ్డలను అవమానపరిచి అందుకు ప్రశ్నించినందుకు మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేసినందుకు మీరు బచ్చాగాళ్ళు నేనే యంపీపీ టాయిలేట్ రూంకితాళం వెయమన్నాను అని తనతోనే స్వయంగా పోన్‌లో చెప్పినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఇలానే వదిలేస్తే మండలంలోమాదిగల ఉనికి ప్రశ్నార్ధకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.మాదిగల సత్తా తెలుపడానికి,ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు ఈ నెల 31వ తేది మండల కేంద్రమైన రాపూరులో మాదిగల ఆత్మగౌర ప్రదర్శన నిర్వహిస్తున్నట్లుతెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిన భాద్యత ప్రతి మాదిగ బిడ్డ మీద వున్నట్లు చెప్పారు. మాదిగలకురాజకీయ ప్రాధాన్యత లేని కారణంగా మన ఆత్మగౌరవ సభను మనమే విజయవంతం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మాదిగ సోదరీ,సోదరమణులు పాల్గోనాలని కోరారు. ఈ సమావేశంలో యంఆర్‌పిఎస్‌నాయకులు హరి,శ్రీరాము లు,శాసన క్రిష్ణయ్య, పోతయ్య,లక్ష్మయ్య, పెద్ద ఎత్తున మాదిగ సోదరులు పాల్గోన్నారు.

## ఆరోగ్యశాఖ విధులపై సిబ్బందికి కమీషనర్ విడియో కాన్ఫరెన్స్



**రాపూరు,మే26ప్రబాతవార్త** వైద్యఆరోగ్య శాఖకు సంబందించి పలు విషయాలపై శుక్రవారం ఆ శాఖ కమీషనర్ నిర్వహించిన విడియో కాన్ఫరెన్స్‌కువేపినాపి ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సూర్యధర్మేంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది పాల్గోన్నారు. మండలపరిషత్ సమావేశమందిరంలో ఈ విడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ ఫ్యామిలీ ఫిజిషయన్ కాన్సెప్ట్ గురించి తీసుకోవలసిన చర్యలు వివరించారు. దీంతో పాటు ఆరోగ్య కార్యకర్తలు విది నిర్వహణలో చేయవలసిన కార్యక్రమాలను వివరించారు.అనంతరం మం డలంలోని సచివాలయం ఆరోగ్య కార్యకర్తలకు డాక్టర్ సచివాలయం పరిధిలో పెండింగ్‌లో వున్నవివరాలను వివరించి వాటిని వాలంటీర్ల సహాయముతో ఆరోగ్యకార్యకర్తలు, మహిళా పోలీసులు చేయవలసిన కార్యక్ర మాలనుపిహెచ్‌సి వైద్యాధికారి వివరించారు. మండలంలో ఆరోగ్య శాఖకు సంబందించిన కార్యక్రమాలు అన్ని సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు.

## 40 మంది లబ్దిదారులకు ఓటిఎస్ పత్రాలు అందజేసిన ఎమ్మేల్యే



**బుచ్చి మే 26 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాలెం పురపాలక సంఘం పరిధిలోని రామచంద్రాపురంలో 40 మంది లబ్దిదారులకు కోవూరు శాసన సభ్యులు నల్లపరెడ్డి చేతుల మీదుగా ఓటిఎస్ పత్రా లు అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిఫల్ చైర్మన్ మోర్ల సుప్రజ,పెన్నాడెల్టా ప్రాజక్టు మాజీ చైర్మన్ యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీదేవి, వైసిపినాయకులు పెంచలయ్య, టౌన్ అద్యక్షులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి,వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి, మండలపార్టీ అద్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి చీమల రమేష్‌బాబు,మోర్ల మురళీ,కౌన్సిలర్ చీర్ల ప్రసాద్, కోడూరు శ్రీకాంత్‌రెడ్డి, కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి,మైనార్టీనాయకులు షేక్ అల్లాబక్షు, కో ఆప్షన్ సభ్యులు అల్లాబక్షు,వైసిపి నాయకురాలు బట్టా ప్రవల్లిక్,బట్టా విల్సన్,కౌన్సిలర్ బెళ్లం మల్లారెడ్డి, కోడూరు మదుసూదన్‌రెడ్డి ,దళితనాయకులు పర్రిబాబు,మండల యువజననాయకులు చిరమణ సురేష్,బ్రిటగుంట సురేష్ తదితరులు పాల్గోన్నారు

## ఎమ్మేల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి గడగడపకు విశేషస్పందన



**బుచ్చి మే 26 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని 7,8,9 వార్డులలో గడగడపకు మన ప్రభుత్వం కార్య క్రమాన్ని కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమా ర్‌రెడ్డి, మున్సిఫల్ చైర్ పర్సన్ మోర్ల సుప్ర జతో కలిసి నిర్ వ్వహించారు. 7,వవార్డు కౌన్సిలర్ షకిలాబేగం, డాక్టర్ అల్లాబక్షు, 8 వవార్డు కౌన్సిలర్ పఠాన్ నస్రీన్,పఠాన్ మహబూభాషా,9 వవార్డు కౌన్సిలర్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి వారికి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలు వివరించి వారికి వచ్చిన పథకాలు నగదు ను గురించి తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి ఇంటికి ఎమ్మేల్యే వచ్చి వారి మంచి చెడ్డలు తెలుసుకునే కార్యక్రమం భారతదేశంలో మొట్టమొదటి సారిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని అన్నారు.జగన్‌మోహన్‌రెడ్డిఏది చేసిన చరిత్రేనని అన్నారు.ఈకార్యక్రమంలో వైసిపి నాయకులు నల్లపరెడ్డి రాజేంద్రకుమార్‌రెడ్డి,నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, పెన్నాడెల్టా ప్రాజక్టు మాజీ చైర్మన్ యర్రంరెడ్డి గోవర్ద్‌నరెడ్డి, జొన్నవాడ దేవస్థానం చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, టౌన్ అద్యక్షులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి,వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి, వైస్ చైర్మన్ షేక్ షాహుల్, మండలపార్టీ అద్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి,మోర్ల మురళీ,కౌన్సిలర్ చీర్ల ప్రసాద్, కోడూరు శ్రీకాంత్‌రెడ్డి, కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి,మైనార్టీనాయకులు షేక్ అల్లాబక్షు, కోఆప్షన్ సభ్యులుఅల్లా బక్షు, వైసిపి నాయకురాలు బట్టా ప్రవల్లిక్,బట్టా విల్సన్,కౌన్సిలర్ బెళ్లం మల్లారెడ్డి, కోడూరు మదు సూదన్‌రెడ్డి ,దళితనాయకులు పర్రిబాబు,మండల యువజననాయకులు చిరమణసురేష్,బ్రిటగుంట సురేష్ పాల్గోన్నారు.

## పాము కరిచి గీత కార్మికుడు మృతి



**వెంకటాచలం మే 26 ప్రభాతవార్త** పాము కరిచి కల్లు గీతా కార్మికుడు మృతి చెందిన సంఘటన మండల పరిదిలో అనికేపల్లి గ్రామములో గురువారం చోటుచేసుకుంది.పోలీసులు కథనం మేరకు వివరాలు అనికేపల్లి గ్రామానికి చెందిన కోసూరు అంకయ్య (51) గురువారం గ్రామ సమీపంలోని పొలాలో ఉన్న తాటిచెట్లు వద్ద ఉన్న కల్లు కుండలను తీసుకోని రావడానికి వెళ్లారు.ఈక్రమంలో కుండలు వద్ద ఉన్న పాము కాటువేసింది.విషయం తెలుచుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నెల్లూరు అసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ అంకయ్య గురువారం రాత్రి మృతి చెందాడు.పోలీసు కేసు నమోదు చేసి మృత దేహన్ని పంచనామ నిర్వహించి బందువులకు అందజేశారు.

## బైక్ బోల్తా పడి వ్యక్తి మృతి



**వెంకటాచలం మే 26 ప్రభాతవార్త** మోటర్‌బైక్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కాకుటూరు సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం జరిగింది.నెల్లూరు శ్రామిక నగర్‌కు చెందిన అతింజెరి రామస్వామి (61) తన మోటర్‌బైక్‌లో గురువారం మనుబోలు మండలంఓని మదమనూరు గ్రామానికి వెళ్లారు.తిరిగి నెల్లూరుకు వెళ్లుతుండగా కాకుటూరు సమీపంలో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.పోలీసు కేసు నమోదు చేసి మృత దేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు.

## ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులు వాలంటీర్‌లు



మర్రిపాడు, మే 26 ప్రభాతవార్త: వాలంటీర్లకు వచ్చే గౌవరవేతనం అరాకొరా వారు చేసే అమోఘం.. నిస్వార్ధపు సేవలో నిరంతరం శ్రమించే శ్రామికుల్లా ప్రనజల కష్టాలను తమ కష్టాలుగా భావించి ప్రభుత్వా ధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కారం చూపే ఏకైక సేవకులు వాలంటీర్లు. రాష్ట్ర ప్రభుత్వం వాలంటీర్ సేవలను గుర్తించిన వేళ మండలంలోని పల్లవోలు సచివాలయం పరిధిలో శుక్రారం 10 మంది సేవా మిత్ర అవార్డులు పొం దారు. ఈసందర్భంగా వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వైసిపి నాయకులు చంద్ర నారాయణస్వామి , సర్పంచ్ బిల్లుపాటి రమాదేవి, పొంగూరు సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు మహేష లు వాలంటీర్లను సర్టిఫికేట్లు , అవార్డులు , శాలువాలతో సత్కరించారు. ఈసందర్భం గా స్థానిక వైసిపి నాయకులు చంద్రా నారాయణస్వామి మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వాలంటీర్లు వారధులని వారి సేవలు అమోఘమన్నారు. ప్రతి వాలంటీర్ పట్టుదలతో ప్రజలకు మెరుగైన సేవలు అం దించే దిశగా పనిచేస్తారన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు పొంగూరు సుధాకర్, సర్పంచ్ బిల్లుపాటి రమాదేవి, ఉపసర్పంచ్ గంగినేని తిరుపతి , పంచాయతీ కార్యదర్శి మహేష్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ప్రజల అవసరాలు తీర్చే దమ్మున్న నాయకుడు జగన్



**సైదాపురం మే 26 ప్రభాతవార్త** రాష్ట్రంలోని పేద ప్రజల అవసరాలను తీర్చే దమ్మున్న ఏకైక నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డవపల్‌మెంట్ చైర్మన్ ,వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వేముల చేడు, పాతాలపల్లి,నల్లబుట్లపల్లి గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార య్రక్రమంలో శుక్రవారం ఆయన పాల్గోన్నారు.ఈ సందర ్బంగా ప్రతి ఇంటికి తిరుగుతు ప్రభుత్వ సంక్షేమపథకాల గురించి వివరిస్తు బుక్‌లేట్‌ను లబ్దిదారులకు అందించారు. అనంతరం మాట్లాడుతు ప్రజా సంక్షేమమే ద్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలకు అండగా ఉంటు అర్హులైన వారికి సంక్షేమపథకాలు అందిస్తు ప్రజల అవసరాలను తీరుస్తున్నారని అన్నారు.అమరావతిలోని పేద ప్రజలకు సుమారు 50 వేల 7 వందల 93 మంది కి ఇండ్ల పట్టాలు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి దేనని తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గానికి వైఎస్ఆర్ పార్టీ తరపున గెలిచిన ఎమ్మేల్యే ప్రజలను మోసం చేసి కొన్ని గ్రామాలలో అభివృద్ధి చేయకుండా అవినీతి మయం చేశారని ఈ అవినీతికి అడ్డుకట్ట వేసేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మేల్యేని తొలగించి నాకు అవకాశం ఇచ్చి గడగడపకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్క రించాలని పంపడం జరిగిందని అన్నారు.అనంతరం వేములచేడు గ్రామంలోని అరుందీయవాడలోని ప్రజలు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకొని రాగా పరిశీలించి వెంటనే పరిష్కరిస్తానని తెలి పా రు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నత్యృత్య కళా సంగీత అకాడమి చైర్మన్ పొట్టేళ్ళ సురేష్,జెసిఎస్ మండల కన్వీనర్ మన్నార్‌పు రవికుమార్, మండల సీనియర్‌నాయకులు చెమర్తి జనార్ధన్‌రాజు,సొసైటీ చైర్మన్ శివకు మార్,జడ్ పిటిసి సభ్యులు చెత్తలూరు పోలయ్య,ఎంపిటిసి ఈశ్వం రాజు,ప్రభా కర్‌రెడ్డి,ప్రసా ద్‌రాజు,వెంకటరాజు మండలనాయకులు తదితరులు పాల్గోన్నారు.

## భూరీసర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి



**కావలి, మే 26 ప్రభాతవార్త** భూ రీసర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా సర్వే లాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ హనుమాన్‌ప్రసాద్ తెలిపారు. కావలి ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం భూ రీసర్వేపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, రీసర్వే అధికారులు, మండల సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు. భూ రీసర్వేను అంకితభావంతో, చిత్తశుద్దితో సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఎటువంటి ఫిర్యాదులు చోటుచేసుకోకూడదన్నారు. ఈ సమావేశంలో కావలి ఆర్డీవో శీనానాయక్ పాల్గొన్నారు.

## స్మశాన వాటికకు బోర్ ఏర్పాటు

**మర్రిపాడు,మే26ప్రభాతవార్త:** మండలంలోని బూదవాడ పంచాయతీలోని కృష్ణాపురం లోని బిసికాలనీల వాసులకు స్మశాన వాటికకు సంబంధించి ఎటువంటి హాండ్ పంప్‌లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానిక వైసిపి నాయకుల దృష్టికి తీసుకెళ్ళగా వైసిపి నాయకులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, బేరి రామ్మోహన్‌రెడ్డి, వైసిపి సోషల్‌మీడియా మెంబర్ ఓంకారం శివసాయికుమార్‌రాజు, చింతగుంట రామకృష్ణారెడ్డి, వార్డ్‌మెంబర్లు అబ్దుల్లా, పలువురు వైసిపి నాయకులు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి తీసుకెళ్ళారు . దాంతో ఎమ్మెల్యే స్పందించి గ్రామస్తుల సమస్యలను పరిష్కరించారు .

## హౌసింగ్ మౌళిక వసతలు కల్పనపై సమీక్ష



**సైదాపురం మే 26 ప్రభాతవార్త** మండలంలోని హౌసింగ్ ప్రోగ్రామ్ కింద మంజూరు అయిన లేవుట్లలలో జంగిల్ క్లీయరెన్స్,మౌళిక వసతులు కల్పనపై డిఎల్‌డిఒ వసుమతి స్దానిక ఎంపిడిఒ కార్యాలయంలో అధి కారులకు శుక్ర వారం సమీక్షా సమావేశం నిర ్వహించారు.ఈ సందర్భంగా లబ్దిదారులు త్వరితగతిన ఇళ్ళులు నేర్మించుకొనుటకు మౌళిక వసతులు కల్పించాలని అన్నారు. అదే విధంగా నాడు-నేడు పథకం ద్వారా గ్రామాలలో జరుగుతున్న పనులను స్దానిక ప్రజాప్రతినిదుల సహాయంతో వేగవంతం చేయాలని అన్నారు. సైదాపురంలోఉన్న సచివాలయం 1,2లను ఆకస్మికంగా ఆమె తనీఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతు సచివాలయం ద్వారా అందించు సరీ ్వసులు మెరుగు పరచుకోవాలని యూనిఫాం కచ్చితంగా ధరించాలని ఆమె అన్నారు.ఈకార్య క్రమంలో హౌసింగ్ డిఇఇ వర ప్రసాద్,నాడు-నేడు ఏఇఇ మృణాలిని,ఎంఇఒ దయాకర్, హౌసింగ్ ఏఇ బాస్కర్‌రావు,ఎపిఎం రాధమ్మ,ఎపిఒ మురళీ పంచాయితీ కార్యదర్శులు,వెల్ఫేర్ అసిస్టెంట్లు,ఇంజనీర్లు అసిస్టెంట్లు పాల్గోన్నారు.

## మంత్రి కాకాణిని సత్కరించిన దామిశెట్టి



**కావలి, మే 26 ప్రభాతవార్త** వ్యవసాయ శాఖా మాత్యులు కాకాణి గోవర్దన్‌రెడ్డిని రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ దామిశెట్టి సుధీర్‌నాయుడు ఘనంగా సత్కరించారు. శుక్రవారం ఆయన మంత్రిని కలిసి సత్కరించారు. రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్‌గా రెండో సారి ఎన్నికైన సందర్భంగా సుధీర్‌నాయుడు మంత్రిని కలిశారు. ఆయన ఆశీస్సులు అందుకున్నారు. రెడ్‌క్రాస్‌ను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించి అందరి మన్ననలు పొందాలని దామిశెట్టిని మంత్రి కోరారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా - ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

**అనంతసాగరం,మే26ప్రభాతవార్త:**



మండలంలోని కామిరెడ్డిపాడు సచివాలయ పరిధిలోని కామిరెడ్డిపాడు, మంగుపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. తొలుత కామిరెడ్డిపాడు గ్రామంలో పర్యటించారు.ఈసందర్భంగా ఆయన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి నాలుగేళ్ళ పాలనలో ప్రతి కుటుంబానికి అందజేసిన సంక్షేమ లబ్ధి కరపత్రాలను ప్రజలకు అందజేశారు. అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని , ఆయన అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారునికి చేరుతన్నాయన్నారు. గడపగడపకు మన ప్రనభుత్వం ద్వారా గ్రామాల్లో పర్య టిస్తున్నామని , ప్రజలు సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కరిస్తామన్నారు. పలు వురు రెవెన్యూ సమస్యలు, భూసమస్యలను ఆయన దృష్టికి తేగా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్క రించేందుకు కృషి చేస్తామన్నారు. కామిరెడ్డిపాడు సచివాలయ పరిధిలో 16కోట్ల రూపాయల సంక్షేమ, అబి. వృద్ధి పనులకోసం అందజేశామన్నారు. అనంతరం మంగుపల్లి గ్రామంలో పర్యటించిన ఆయన ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను అందజేసి సమస్యనలు తెలుసుకున్నారు. మాజీ సర్పంచ్ గోపిరెడ్డి పద్మజారెడ్డి గ్రామ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. త్వరితగతిన పరిష్కరిస్తామని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షురాలు పెయ్యల సంపూర్ణ, రాష్ట్ర క్రీడాభివృద్ధి డైరెక్టర్ కాలువ నర్సింహులు, ఎంపిడిఒ ఎ.మధుసూధన్‌రావ్, తహసిల్దార్ టి.ప్రదీప్, హౌసింగ్ ఎఇ ఉదయ్‌భాస్కర్, మండల సచివాలయాల కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, అగ్రహారం సర్పంచ్ లక్ష్మీదేవి, కామిరెడ్డిపాడు సర్పంచ్ బుట్టి భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బిసి హాస్టల్ విద్యార్ధికి రాష్ట్ర స్దాయి పురస్కారం అందజేత



**సంగం మే 26 ప్రభాతవార్త** బిసి వసతి గృహాలలో అద్భుతమైన ఫలితాలుసా ధించినట్లు సంక్షేమాధికారిణి ఎం.మల్లేశ్వరీ తెలిపారు. అనంతసాగరం బిసి హాస్టల్ విద్యార్ధి షేక్ నాయబ్ 575 మార్కులు సాధించి విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో బిసి సంక్షేమశాఖ మంత్రి చెల్లు బోయిన వేణుగోపాలకృష్ణా చేతులు మీదుగా పురస్కారాన్ని అందుకున్నట్లు ఆమె తెలిపారు. అలాగే సంగం బాలికల వసతిగృ హంలో 4 విద్యార్ధినులు 5 వందలకు పైగా మార్కులు సాధించినట్లు ఆమె తెలిపారు.అలాగే రేవూరు ఇద్దరు బాలురు 5 వందలకు పైగా మార్కులు సాధించారని ఆమె వివరించారు.అనంతసాగరం హాస్టల్‌లో 4 విద్యార్ధులు 5 వందల పైగా మార్కులు సాధించారని ఆమె చెప్పారు.ఈ సందర్భంగా బిసి సంక్షేమాధికారిణి మల్లేశ్వరిని జిల్లా అధికారి వై.వెంకటయ్య,ఎబిసి డబ్ల్యూ శ్రీదేవి పలువురు వార్డన్లు అభినందించారు.

## జనసైనికుల మనోభావాల్ని దెబ్బతీస్తున్న ఫ్లెక్స్‌ల్ని వెంటనే తొలగించాలి



**కావలి, మే 26 ప్రభాతవార్త** కావలి పట్టణ ఓవర్ బ్రిడ్జి సెంటర్‌లో జనసైనికుల మనోభావాలను దెబ్బతీసే విధంగా కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఫ్లెక్స్‌ల్ని వెంటనే తొలగించాలని జనసేన నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం కావలి డిఎస్పీ వెంకట రమణను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మీడియా సమావేశంలో జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్, జనసేన నేతలు రిషికేష్, తిరుమలశెట్టి సుధీర్, ఆలా శ్రీనాథ్, మస్తాన్, శ్రీను, చంటి, చరణ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. పవన్ కళ్యాణ్‌ను కించపరిచేలా ఫ్లెక్స్‌లు ఏర్పాటు చేయడం దుర్మార్గమన్నారు. వెంటనే ఈ ఫ్లెక్స్‌ల్ని తొలగిం చాల న్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అవినీతి,దోపిడీలపై తాము కూడా ఫ్లెక్స్‌లు వేస్తామని ఖబడ్దార్ అంటూ హెచ్చరికలు చేశారు. జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్‌ని కించపరిచే విధంగా కావలి ఎమ్మెల్యే వేసిన ఫ్లెక్స్‌లు కార్యకర్తల, అభిమానుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వున్నాయన్నారు. యుద్ధప్రాతిపదికన కావలి డిఎస్పీ, కావలి మున్సిపల్ కమిషనర్‌లు ఫ్లెక్స్‌లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో జరగబోయే పరిణామాలను, జనసైనికుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరికలు చేశారు. కావలిలో ఎటువంటి అభివృద్ధి చేయలేని ఈ ఎమ్మెల్యే అవినీతి, దోపిడీలపై ఫ్లెక్సీల ద్వారా బండారం బయటపెడతామని హెచ్చరికలు చేశారు.పేదలకు, పెత్తందార్లకు మధ్య జరిగే యుద్దం అంటూ చంద్రబాబునాయుడు, నారా లోకేష్‌ల పల్లకీ మోస్తున్నట్లు పవన్‌కళ్యాణ్ బొమ్మ వేసి కించపర్చడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

## సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

**చేజర్ల,మే26ప్రభాతవార్త:** మండలంలోని రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలను 50శాతం సబ్సిడీపై అందించనున్నట్లు చేజర్ల మండల వ్యవసాయాధికారి వి.శశిధర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పంటలను సాగుచేసే ముందుగా పొలాల్లో సారాన్ని పెంచేందుకు పచ్చిరొట్ట ఎరువులను ఉపయోగిస్తారన్నారు. ఇందులో భాగంగా జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు .విత్తనాలు కావాల్సిన రైతులు వారి వారి సచివాలయ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు . అనంతరం రైతు చెల్లించాల్సిన వాటాను చెల్లిస్తే విత్తనాలను అక్కడికక్కడే అందజేస్తారన్నారు. జీలుగ పూర్తి ధర 79రూపాయలు కాగా 39-50రూపాయలు సబ్సిడీపోను మిగిలిన 39-50రూపాయలు రైతు వాటాగాను , జనుము కేజీ 84రూపాయలు కాగా 42రూపాయలు సబ్సిడీ పోను రైతు వాటా 42రూపాయలు , పిల్లిపెసర కేజీ 97రూపాయలు కాగా 48-50రూపాయలు సబ్సిడీపోను మిగిలిన 48-50రూపాయలను రైతువాటా గా చెల్లించాలన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు వెంటనే వారి సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని 50శాతం సబ్సిడీపై విత్తనాలు పొందవచ్చని మండలంలో అవసరమైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.